సాక్షి బాపట్ల

బుధవారం । 9 । ఆగస్టు । 2023



ఆరోగ్యశ్రీ లేకున్నా గుండె ఆపరేషన్

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్‌లో ఆరోగ్యశ్రీ కార్డు లేని రోగులకు సైతం గుండె ఆపరేషన్లు తప్పనిసరిగా చేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ చెప్పారు.




క్విట్ ఇండియా దినోత్సవం

పెదకూరపాడు : పెదకూరపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో క్విట్ ఇండియా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు.

స్వామి వారికి గంధాభిషేకం

పిడుగురాళ్ల: పట్టణలోని పిల్లుట్ల రోడ్డులో వేంచేసి ఉన్న నాగుల గుడిలో మంగళవారం సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, 18 కిలోల గంధంతో అభిషేకం చేశారు. భక్తులు విశేషంగా తరలివచ్చారు.



న్యూస్‌రీల్

ఎస్‌జీఎస్టీలో భారీగా బదిలీలు

పాత గుంటూరు : ఎస్‌జీఎస్టీలో భారీగా బదిలీలు జరిగాయి. గుంటూరు జిన్నాటవర్ సెంటర్లోని ఎస్ జీఎస్టీ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగుల బదిలీలపై గత నాలుగు రోజుల నుంచి జరిగిన కసరత్తు మంగళవారం కొలిక్కి వచ్చింది. నోడల్ జాయింట్ కమిషనర్ మధుబాబు ఆధ్వర్యంలో ఉద్యోగుల బదిలీలపై మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. గుంటూరు జోన్–3 పరిధిలోని జూనియర్ అసిస్టెంట్లు 88, సీనియర్ 95 మంది, జీఎస్‌టీవోలు 74 మంది, వీరందరినీ జోన్ పరిధిలో ఉన్న 21 సర్కిల్ కార్యాలయాలకు, మూడు డివిజన్ కార్యాలయాలకు బదిలీ చేయడమే కాక, మిగిలిన సిబ్బందిని విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం రాష్ట్ర ప్రధాన కార్యాలయాలకు బదిలీ చేశారు.

పలువురికి ఉద్యోగోన్నతులు,
ఆరుగురు సీనియర్ అసిస్టెంట్లకు జీఎస్టీవోలుగా, ఆరుగురు జీఎస్టీవోలకు డెప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లుగా, ముగ్గురు డెప్యూటీ కమిషనర్లకు అసిస్టెంట్ కమిషనర్లుగా ఉద్యోగోన్నతులు కల్పించారు. ఎనిమిది మంది డెప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లకు స్థాన చలనం కల్పించారు. అయితే సంస్కరణల ఫలితంగా కొందరు చిరుద్యోగులు దూర ప్రాంతాలకు బదిలీ కావడంతో వారు తీవ్ర నిరాశకు గురయ్యారు. తమకు తిరిగి ఓడీ సౌకర్యంపై సొంత ప్రాంతాలలో ఉద్యోగం చేసే వెసులుబాటు కల్పించాలని అధికారులను కోరుతున్నారు. ఉద్యోగ సంఘ నాయకులు లేకుండా కేవలం ఉన్నతాధికారుల పర్యవేక్షణలోనే బదిలీల ప్రక్రియ కొనసాగింది.

సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేట టౌన్: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఓ. వెంకట నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులతో పాటు సివిల్ కేసులు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నూతన భవన నిర్మాణాలతో మరిన్ని సేవలు: కలెక్టర్

గుంటూరు (శ్రీడలు) : ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలు పూర్తయితే స్థానిక ప్రజలకు మరిన్ని సత్వర సేవలు అందుబాటులోకి వస్తాయని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో జిల్లాలో వివిధ ప్రదేశాల్లో నిర్మాణంలో ఉన్న గ్రామ, వార్డు సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్, అంగన్‌వాడీలు, ఆర్బీకేలు సెప్టెంబర్ 15 నాటికి ప్రారంభించాలన్నారు. గ్రామ సచివాలయాలు 208 నిర్మించాల్సి ఉండగా 88 పూర్తయ్యాయన్నారు. ఆర్బీకేలు 34 లక్ష్యం కాగా మొత్తం పూర్తి చేశారని చెప్పారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు 28 లక్ష్యం కాగా 17 పూర్తి చేశారని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద 243 పనులు చేపట్టగా వాటిలో 82 పూర్తయ్యాయని, 148 వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వీటి నిర్మాణాలు ఎప్పటికప్పుడు జిల్లా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. నిర్మాణాలకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని చెప్పారు. అవసరమైతే ప్రభుత్వ నిధులు అందుబాటులో ఉంటే దశల వారీగా ఉపయోగించుకోవాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో పంచాయితీ రాజ్ ఎస్ఈ గుర్రం బ్రహ్మయ్య, ఈఈ రమేష్, అధికారులు పాల్గొన్నారు.

రైతుల ఫిర్యాదుతో బైపాస్ పనులపై సర్వే



నాదెండ్ల: చిలకలూరిపేట బైపాస్ నిర్మాణ పనుల్లో కొన్ని లోపాలు జరుగుతున్నాయంటూ రైతులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గణపవరం నుంచి అప్పాపురం వెళ్లే డొంక రోడ్డులో సర్వే నెం.278లో రోడ్డు ఎలైన్‌మెంట్‌లో మార్పులు జరిగాయని, దీంతో తమ సొంత భూముల్లో నేషనల్ హైవే అధికారులు రోడ్డు వేస్తున్నారంటూ ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు నేషనల్ హైవే ఇంజనీర్ల బృందంతో మండల సర్వేయర్ అబ్బూరి శ్రీనివాసరావు, గ్రామ సర్వేయర్లు పవన్‌కుమార్, అనిల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతుల సమక్షంలో కొలతలు వేశారు. ఈ సర్వే నెంబరులో కొంత నేషనల్ హైవే బౌండరీ దాటి రైతుల పొలాల్లో రోడ్డు నిర్మాణం జరుగుతున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. దీనిపై మండల సర్వేయర్ అబ్బూరి శ్రీనివాసరావు నివేదికను జేసీకి అందిస్తామని వివరించారు.

భూ దురా'గతం'

రెవెన్యూ అధికారుల అవినీతి ఫలితం

- రీసర్వేలో బయటపడుతున్న లీలలు
- 111 ఎకరాల ప్రభుత్వ భూమి హాంఫట్
- మల్లగుల్లాలు పడుతున్న ప్రస్తుత అధికారులు
- ఒక్కో ఎకరం రూ.కోటిపై మాటే



నాయినపల్లి సర్వే 59లోని సానపోరంబోకు భూములు

చీరాల: ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు గద్దల్లా తన్నుకుపోతున్నారు అక్రమార్కులు. అది బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గ పరిధిలోని వేటపాలెం మండలం నాయినపల్లి రెవెన్యూ డివిజన్. నేషనల్ హైవే ఒంగోలు నుంచి దిగమర్రు జాతీయ రహదారి పక్కనే చల్లారెడ్డిపాలెం గ్రామం దగ్గరలోని 111 ఎకరాల ప్రభుత్వ సానపోరంబోకు భూమి ఉంది. ఈ భూమి వ్యవసాయానికి అనువుగా సాగునీటి అవసరాల కోసం వినియోగంలో ఉన్నట్లు ప్రభుత్వ రికార్డుల్లో చూపెడుతోంది. అయితే ఈ భూముల ధరలకు రెక్కలు రావడంతో కొందరు కన్నేశారు. రెవెన్యూ అధికారులు కాసుల కోసం కక్కుర్తిపడి ఆ భూములను ప్రభుత్వ సర్వే నంబర్లుగా చూపకపోవడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవి ప్రైవేటు భూములుగా మారాయి. రిజిస్ట్రేషన్లు జరిగిపోవడంతో ప్రభుత్వ భూముల్లో ప్రైవేటు వ్యక్తులు పాగా వేశారు. జాతీయ రహదారి పడడంతోపాటు భూముల ధరలు అమాంతంగా పెరగడం వల్ల ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఒక్కో ఎకరా ధర రూ.కోటి పైమాటే.

అసలు ఏం జరిగిందంటే..
వేటపాలెం మండలంలోని నాయినపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని సర్వే 59–1, 2, 3, 4,5, 6, 7, 8, 9 సబ్ డివిజన్‌ల పరిధిలో పూర్వం 111 ఎకరాల సాన పోరంబోకు ప్రభుత్వ భూమిగా రెవెన్యూ రికార్డులో నమోదై ఉంది. ఈ భూమిని 1956లో అప్పటి రెవెన్యూ అధికారులు 18 ఎకరాల భూమిని ఏడబ్ల్యూ కిందకి కన్వర్షన్ చేసి అక్కడ కొందరికి పట్టాలు ఇచ్చారు. అనంతరం 1993లో అధికారులు మిగిలిన 93 ఎకరాలను 83 భిన్నాలుగా విభజించారు. అయితే ఈ భూములను ప్రభుత్వానివిగా పేర్కొంటూ సర్వే నంబర్లతో సహా రికార్డులను రిజిస్ట్రార్ కార్యాలయానికి పంపాల్సిన అధికారులు కాసులకు కక్కుర్తి పడి ఆ పని చేయలేదు. దీంతో అవి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. అక్రమార్కులు ఆ భూములు తమ పూర్వీకులవని రిజిస్టర్ చేయించుకున్నారు.

తవ్వేకొద్దీ బయట పడుతున్న రెవెన్యూ అక్రమాలు
వేటపాలెం మండల పరిధిలోని ప్రభుత్వ అసైన్డ్ సాన పోరంబోకు, డ్రెయినేజీ పోరంబోకు, కుందేరు పోరంబోకు వంటి ప్రభుత్వ భూములు వందల ఎకరాల్లో ఉన్నాయి. ఈ భూములు దాదాపు 90 శాతం ప్రైవేట్ వ్యక్తుల స్వాధీనంలోకి వెళ్లిపోయాయి. ఈ విషయాలు సర్వే అధికారులకు తలనొప్పిగా మారాయి. కుందేరు పోరంబోకు భూముల్లో వందల ఎకరాలు కొందరు ఆక్రమించి రొయ్యల చెరువులు సాగు చేశారు.

పేదలకు పట్టాలివ్వడానికి దొరకని భూమి...
చీరాల, వేటపాలెం మండలాల్లో ప్రభుత్వ భూమి వేల ఎకరాల్లో ఉన్నా.. అంతా ప్రైవేటు వ్యక్తుల స్వాధీనంలోకి వెళ్లిపోయింది. ఫలితంగా పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వం దాదాపు ఏడాదిగా ప్రయత్నిస్తోంది. ప్రభుత్వ భూమి దొరక్క ప్రైవేట్ భూమిని రూ.కోట్లు పెట్టి కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సుప్రీంకోర్టు ఏం చెప్పిందంటే...
ప్రభుత్వ పోరంబోకు భూములపై ప్రైవేటు వ్యక్తులకు ఎటువంటి హక్కూ ఉండదని సుప్రీంకోర్టు ఇటీవల తేల్చి చెప్పింది. రెవెన్యూ అధికారులు పట్టాలు ఇచ్చినా చెల్లుబాటు కావని అనేక సందర్భాల్లో స్పష్టం చేసింది.

రీసర్వేలో బయటపడిందిలా..

ప్రస్తుతం నాయినపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో రీ సర్వే జరుగుతోంది. సర్వే సిబ్బందికి రెవెన్యూ రికార్డులో సర్వే 59లో 111 ఎకరాలు సాన పోరంబోకు భూమిగా నమోదై ఉంది. క్షేత్ర స్థాయిలో భూమిలో ఉన్న రైతులు తమ సొంత పట్టాభూమి అని దాని తాలూకు రిజిస్టర్ డాక్యుమెంట్‌లు చూపిస్తున్నారు. రెవెన్యూ కార్యాలయం నుంచి పొందిన పట్టాదారు పాస్ పుస్తకాలు సైతం చూపిస్తున్నారు. దీనితో సర్వే సిబ్బంది ఏం చేయాలో పాలుపోక అవస్థలు పడుతున్నారు.



నాయినపల్లి సర్వే 59లో ప్రైవేటు వ్యక్తుల స్వాధీనంలో ఉన్న సానపోరంబోకు భూమి

పూర్తి స్థాయిలో విచారణ చేపడతాం



నేను ఇటీవలే బదిలీపై వేటపాలెం తహసీల్దార్‌గా వచ్చాను. ఆ భూమిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఏ మేరకు అక్రమాలు జరిగాయో పరిశీలిస్తాను. నివేదికను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తాను.
– అశోక్‌వర్ధన్, తహసీల్దార్, వేటపాలెం

గంజాయి రహిత బాపట్ల జిల్లానే లక్ష్యం

- అమ్మినా, తాగినా కఠిన చర్యలు
- చీరాలలో 9 మంది అరెస్ట్
- రూ.2.35 లక్షల విలువైన 23 కేజీల గంజాయి స్వాధీనం
- ఎస్పీ వకుల్ జిందాల్ వెల్లడి



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: గంజాయి రహిత బాపట్ల జిల్లానే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఎవరైనా గంజాయి తాగినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్‌జిందాల్ స్పష్టం చేశారు. తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో గంజాయి విక్రయాలపై నిఘా పెట్టామని చెప్పారు. చీరాలలో 9 మంది గంజాయి విక్రేతలు, తాగేవారిని అరెస్ట్ చేసినట్టు వివరించారు. ఆ కేసు వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. చీరాల రూరల్ సీఐ ఎ.మల్లికార్జున, చీరాల రూరల్ ఎస్ఐ పి.జనార్ధన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన తనిఖీల్లో చీరాల మండలం, కావూరివారిపాలెం పంచాయతీ పరిధిలోని కుందేరు వాగు పక్కన ఉన్న యదలమ్మ చెట్టు వద్ద పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నిస్తున్న మాదిగాని జీవన్ కుమార్, దోనేపూడి విజయ్ కుమార్ అలియాస్ టింకులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా, బాపట్ల మండలం, స్టువర్టుపురం గ్రామానికి చెందిన తిమోతి అదే ప్రాంతానికి చెందిన సునీల్ వద్ద గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తున్నట్టు తెలిసింది. సునీల్ స్టువర్టుపురం గ్రామానికి చెందిన బోగిరి ప్రదీప్, పూజారి ప్రేమ్‌చంద్ అలియాస్ నాని, చీరాల ఉజిలిపేటకు చెందిన మత్ర శ్రావణ్‌కుమార్ అలియాస్ నాని వద్ద నుంచి గంజాయి తీసుకువస్తున్నట్లు తెలిసింది. దీంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. చీరాల పరిసర ప్రాంతాల్లో గంజాయి తాగుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. మొత్తం 9 మంది వద్ద రూ.2.35 లక్షల విలువైన 23 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులను అభినందించిన ఎస్పీ
గంజాయి కేసులో నిందితులను అరెస్ట్ చేయడంలో కృషిచేసిన చీరాల రూరల్ సీఐ ఎ.మల్లికార్జునరావు, చీరాల రూరల్ ఎస్ఐ పి.జనార్ధన్, చీరాల రూరల్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్స్ వెంకయ్య, పిచ్చియ్య, పోలీస్ కానిస్టేబుళ్లు కృపారావు, నాగాంజనేయులు, భాస్కర్ రావు, నాగరాజు,హోంగార్డు శ్రీనివాసరావును ఎస్పీ వకుల్‌జిందాల్ అభినందించారు. ప్రశంసాపత్రాలు అందజేశారు. సమావేశంలో జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్, చీరాల డీఎస్పీ ఎస్. ప్రసాదరావు, చీరాల రూరల్ సీఐ ఎ.మల్లికార్జునరావు, చీరాల రూరల్ ఎస్ఐ పి.జనార్ధన్ పాల్గొన్నారు.

'సారా లోకేష్ నువ్వా నీతులు చెప్పేది'

సాక్షి, నరసరావుపేట: ''సారా అమ్మి సంపాదించిన డబ్బుతో కట్టుకున్న ఇంట్లో ఉంటున్న సారా లోకేష్ నువ్వా నీతులు చెప్పేది'' అంటూ నారా లోకేష్‌పై గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి విరుచుకుపడ్డారు. మీ తండ్రి చంద్రబాబు తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచాక సారా అమ్మి సంపాదించిన డబ్బుతోనే జూబ్లీహిల్స్‌లో స్థలం కొని ఇల్లు కట్టించారని, ఆ ఇంట్లోనే ప్రస్తుతం నువ్వు, నీ తండ్రి నివాసం ఉంటున్నారని పేర్కొన్నారు. సారా డబ్బుతోనే జూబ్లీహిల్స్‌లో చంద్రబాబు స్థలం కొన్నాడు అన్నది తాను కాదని, ప్రజాయుద్ధనౌకగా పిలిచే గద్దర్ పలు సందర్భాలలో తన పాటల ద్వారా ప్రజలకు చెప్పారని గుర్తుచేశారు. అందుకే ఇక నుంచి సారా లోకేష్ అనే పిలుస్తామని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో గురజాల నియోజకవర్గంలో రూ.2,265 కోట్లు ఖర్చు చేశామని, అందులో రూ.2,020 కోట్లు సీసీ రోడ్లకు ఖర్చు చేశామన్న మాటకు లోకేష్ కట్టుబడి ఉంటారా అని కాసు ప్రశ్నించారు. 2014–19 మధ్య రూ.2 వేల కోట్లతో సీసీ రోడ్లు వేసినట్టు రుజువు చేస్తే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని కాసు స్పష్టం చేశారు.

ఒక్కమాత్రతో 'నులి'మేద్దాం

- రేపు జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం
- గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉచితంగా మాత్రలు పంపిణీ
- 17న స్పెషల్ డ్రైవ్



డీవార్మింగ్ పోస్టర్లు

జిల్లాలో ఇలా..

కళాశాలలు :	165
అంగన్‌వాడీకేంద్రాలు :	1,480
పాఠశాలలు	: 1,672
1 నుంచి 19ఏళ్లలోపు పిల్లలు	: 5,91,322

గుంటూరు మెడికల్: బాల్యంలో చిన్నారులను అనేక ఆరోగ్య సమస్యలు వెంటాడుతూ ఉంటాయి. తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఆడుతూపాడుతూ స్కూల్‌కు వెళ్లాల్సిన పిల్లలు కడుపునొప్పి అని చెబితే తక్షణమే వైద్యుడిని సంప్రదించాలి. చిన్నారుల జీవితాన్ని నులిపురుగులు నులిమేస్తున్నాయి. ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. వీటిని ఒకేఒక్క మాత్ర అల్బెండజోల్‌తో నివారించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 10న జిల్లా వ్యాప్తంగా నులిపురుగు నివారణ కార్యక్రమం చేపట్టింది. దీనిలో భాగంగా అల్బెండజోల్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తోంది.

అనర్థాలు ఇవీ..
- నులిపురుగులు చిన్నారుల్లో రక్తహీనతకు దారితీస్తాయి.
- శారీరక, మానసిక ఎదుగుదలకు ఆటంకంగా మారతాయి. కడుపు నొప్పి, మంట, వికారం కలుగచేస్తాయి.
- ఆహారం సహించదు. ఆకలి ఉండదు.
- పిల్లలు నీరసపడతారు.
- వాంతులు, మలంలో రక్తం, అతిసారం ప్రబలుతాయి.
- ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లల్లో నులి పురుగుల సమస్య ఎక్కువగా ఉంటుంది.

నివారణకు ఏం చేయాలి
- పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.
- ఎప్పుడూ చేతిగోళ్ళను కత్తిరించుకోవాలి. శుభ్రంగా ఉంచుకోవాలి. గోళ్లలో పేరుకున్న మట్టి ద్వారా నులిపురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయి.
- కలుషిత నీరు తాగడం, బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన వల్ల కూడా పురుగులు శరీరంలోకి వెళ్లే ప్రమాదం ఉంది.
- కాళ్లకు చెప్పులు లేదా బూట్లు ధరించాలి.
- భోజనం ముందు, తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలి.
- కూరగాయలను నీటితో శుభ్రంగా కడగాలి.
- ఆహారపదార్థాలపై మూతలు వేయాలి.

మాత్రల డోస్ ఇలా...
ఏడాది నుంచి రెండేళ్ళలోపు చిన్నారులకు ఆల్బెండజోల్ సగం మాత్ర(200 మిల్లీగ్రాములు) నీళ్లలో కలిపి పట్టించాలి. 2 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలు 400 మిల్లీ గ్రాముల మాత్రను మధ్యాహ్నం భోజనం తరువాత చప్పరించేలా చూడాలి. మాత్రను మింగకుండా పర్యవేక్షించాలి. పాఠశాలల్లో బోధనా సిబ్బంది, వైద్య సిబ్బంది పర్యవేక్షణలో మాత్రలు చప్పరించేలా చూడాలి.

అందరూ వేసుకోవచ్చు



పిల్లల్లో మూడు రకాల పురుగులు ఉండే అవకాశం ఉంది. అవి ఏలికపాములు, నులి, కొంకిపురుగులు. వీటిని నిర్మూలించేందుకు ఆల్బెండజోల్ మాత్రలను తీసుకోవాలి. మాత్రను భోజనం తరువాత తీసుకోవాలి. మాత్ర వేసుకున్న ఒక రోజు లేదా రెండు రోజుల్లో పురుగులు మలవిసర్జన ద్వారా బయటకు వెళ్తాయి. మాత్రలను దీర్ఘకాలిక రోగులు, ఇతర మందులు వాడుతున్న వారూ తీసుకోవచ్చు.
డాక్టర్ తిమ్మాపురం. చంద్రశేఖర్‌రెడ్డి, పిల్లల వైద్యనిపుణులు, గుంటూరు

విద్యాసంస్థల్లో పంపిణీ

కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యాసంస్థలకు ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. రాష్ట్రీయ బాల స్వాస్థ్య ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టాం. 10న పాఠశాలల్లో విద్యార్థులు మాత్రలు తీసుకునేలా చూస్తాం. ఆ రోజు తీసుకోని వారికి ఈనెల 17న స్పెషల్ డ్రైవ్ పెట్టి మాత్రలను అందిస్తాం.
డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డీఎంహెచ్‌ఓ, గుంటూరు.

టీడీపీ భూస్థాపితం కావడం ఖాయం

- సీఎం వైఎస్ జగన్ మొనగాడు
- ఒంటిచేత్తో పార్టీని గెలిపించుకున్న గొప్ప నేత జగన్
- మీ నాన్ననడుగు చెబుతాడు
- వార్డు మెంబర్‌గా గెలవలేని నువ్వా చెప్పేది!
- లోకేష్‌పై ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ధ్వజం

మాచర్ల: రాష్ట్రంలో వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని దద్దమ్మ నారా లోకేష్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించి అవాకులుచెవాకులు పేలితే సహించేది లేదని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం మూడు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంత మొనగాడో మీ నాన్నను అడిగితే చెబుతాడు' అని లోకేష్‌కు హితవుపలికారు. పెయిడ్ ఆర్టిస్టును తీసుకొచ్చి కారెంపూడిలో ఇష్టవచ్చినట్టు మాట్లాడడం పప్పు, బఫూన్ లోకేష్‌కే చెల్లిందని ఎద్దేవా చేశారు. ఎవరో రాసిన స్క్రిప్టును సరిగా చదవడం కూడా రాని లోకేష్ వాస్తవాలు తెలుసుకొని మాట్లాడకపోతే 2024లో ఓటమి తర్వాత శాశ్వతంగా హైదరాబాద్‌లో దాక్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. 2024 తర్వాత టీడీపీ భూస్థాపితం కావడం ఖాయమని పిన్నెల్లి స్పష్టం చేశారు.

ఈవెనింగ్ వాక్
కాంగ్రెస్ పార్టీతో కలిసి చంద్రబాబు కుట్రలు పన్ని జైలుకు పంపినా అకుంఠిత దీక్షతో ఒంటిచేత్తో పార్టీని గెలిపించుకున్న ధీరుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని పిన్నెల్లి పేర్కొన్నారు. అసలు లోకేష్ చేసేది పాదయాత్ర కాదని, ఈవెనింగ్ వాక్ అని ఎద్దేవా చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలపై విమర్శలు చేసే స్థాయి నీది కాదని లోకేష్‌కు హితవుపలికారు.

బ్రహ్మారెడ్డి క్రిమినల్
మాచర్ల నియోజకవర్గంలో టీడీపీ పెయిడ్ ఆర్టిస్టు బ్రహ్మారెడ్డి, మరికొంత మంది రాసిచ్చిన స్క్రిప్టును లోకేష్ చదివాడని, ఏడు హత్య కేసుల్లో క్రిమినల్‌గా ఉండి చివరికి తండ్రైన జూలకంటి నాగిరెడ్డిని చివరిదశలో పట్టించుకోకుండా రోడ్డు పాలు చేసిన చరిత్ర బ్రహ్మారెడ్డిదని పిన్నెల్లి విమర్శించారు. తమ కుటుంబానికి 30 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉందని, తనపై ఆరోపణలు చేసే స్థాయి లోకేష్‌కు లేదని ధ్వజమెత్తారు. తమ కుటుంబం రెండు సార్లు టీడీపీ పెయిడ్ ఆర్టిస్టును ఓడించిందని గుర్తుచేశారు. తాను రూ.వెయ్యికోట్లు అక్రమంగా సంపాదించానని చెబుతున్న లోకేష్ దానిని ఎక్కడ దాచానో కూడా చెప్పాలని డిమాండ్ చేశారు. తనపై చేసిన ఆరోపణలను దమ్ముంటే నిరూపించాలని పిన్నెల్లి సవాల్ విసిరారు.

కాళ్లు పట్టుకుని నదిలో నెట్టేశాడు

రావులపాలెం ఘటనలో మృత్యుంజయురాలు లక్ష్మీసాయి కీర్తన



తెనాలిలో ఉన్న లక్ష్మీసాయికీర్తన

తెనాలిరూరల్: తన తల్లిని, చెల్లిని కాళ్లు పట్టుకుని సురేష్ నదిలోకి నెట్టేశాడని మృత్యుంజయురాలు లక్ష్మీసాయికీర్తన తెలిపింది. తెనాలిలోని తన పెద్దమ్మ సంరక్షణలో ఉన్న బాలిక మంగళవారం విలేకర్లతో మాట్లాడింది. షాక్ నుంచి ఇంకా తేరుకోని బాలిక భోరుమంటూనే తన కళ్ల ముందే జరిగిన భయానక దుర్ఘటన గురించి వివరించింది. కారు కొన్నానంటూ సురేష్ తన తల్లి సుహాసినితోపాటు తనను, తన చెల్లి జెర్సీని తీసుకెళ్లాడని, గోదావరి నదిని చూద్దామని, ఫొటోలు దిగుదామని కారు ఆపాడని తెలిపింది. అక్కడ వంతెన రెయిలింగ్ వద్ద నిలబడి ఉండగా తన తల్లి కాళ్లు పట్టుకుని నదిలోకి నెట్టేశాడని, ఏడాది వయసున్న తన చెల్లిని నదిలోకి విసిరేశాడని తెలిపింది. తనను నెట్టేయగా, పైపు ఆసరా దొరకడంతో పట్టుకుని ఉన్నట్టు వెల్లడించింది. డయల్ 100కు ఫోన్ చేయగా పోలీసు అంకుల్ ఫోన్ చేసి మాట్లాడుతూ వంతెన వద్దకు వచ్చారని, హారన్ మోగిస్తూ వినపడుతుందా అని అడుగుతూ, నదిలోకి టార్చిలైటు వేసి కనబడుతుందా అని అడుగుతూ విజిల్ వేసుకుంటూ వచ్చి తన ఆచూకీ గుర్తించి కాపాడారని తెలిపింది.

నవులూరులో సినీఫక్కీలో చోరీ

మంగళగిరి: కళ్లల్లో కారం కొట్టి ఓ మహిళ మెడలో బంగారు నానుతాడు లాక్కెళ్లిన ఘటన మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధి నవులూరులో మంగళవారం జరిగింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. నవులూరుకు చెందిన చల్లా లక్ష్మీనరసింహమూర్తి, శ్రీదేవి భార్యాభర్తలు. లక్ష్మీనరసింహమూర్తి పౌరోహిత్యం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుండగా శ్రీదేవి గృహిణి. వీరికి రెండు పోర్షన్ల ఇల్లు ఉండగా ఓ పోర్షన్ అద్దెకు ఇచ్చే ఉద్దేశంతో బయట గేటుకు ఇటీవల టూలెట్ బోర్డు పెట్టారు. ఈనేపథ్యంలో మంగళవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి టూ లెట్ బోర్డు చూసి ఆపి నేరుగా ఇంట్లోకి వెళ్లాడు. ఒంటరిగా ఉన్న శ్రీదేవి ఎవరు మీరు అంటూ ప్రశ్నించడంతో ఇల్లు అద్దెకు కావాలని అడిగాడు. ఇల్లు అద్దెకు ఇస్తామని, అయితే ఇలా నేరుగా ఇంట్లోకి రావడం ఏమిటని ప్రశ్నించి ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో ఆ దుండగుడు తన వెంట తెచ్చుకున్న కారాన్ని శ్రీదేవి కళ్లల్లో కొట్టి ఆమె మెడలో ఉన్న సుమారు రూ.లక్ష విలువైన 24 గ్రాముల బంగారు నానుతాడును లాక్కోవడంతో శ్రీదేవి బిగ్గరగా కేకలు వేసింది. అయితే అప్పటికే దుండగుడు ద్విచక్ర వాహనంపై పారిపోయాడు. బాధితురాలు శ్రీదేవి మంగళగిరి రూరల్ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1200, గరిష్ట ధర రూ.2200, మోడల్ ధర రూ.1800 వరకు పలికింది.



13న గ్రూప్-1, 2 పరీక్షలపై అవగాహన సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీపీఎస్సీ త్వరలో నిర్వహించనున్న గ్రూప్–1, 2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ఈనెల 13న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు అమిగోస్ ఐఏఎస్ అకాడమీ అకడమిక్ డైరెక్టర్ జనార్ధన్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని అకాడమీ కార్యాలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు జరగనున్న అవగాహన సదస్సులో గ్రూప్–1, గ్రూప్–2 నూతన సిలబస్, ప్రిపరేషన్ స్ట్రాటజీ, నోట్సు మేకింగ్ తదితర అంశాలపై సీనియర్ అధ్యాపకులచే సమగ్ర అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఉచితంగా ప్రిలిమ్స్ మాక్ పరీక్ష పేపర్ అందజేస్తామని పేర్కొన్నారు. 040–35052121, 9000230734 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మీ భూమి-మా హామీ సర్వేతో ప్రజలకు ఉపయోగం

రీ సర్వే ప్రాజెక్ట్ రాష్ట్ర ప్రత్యేక అధికారి సుబ్బారావు



అధికారులకు సూచనలిస్తున్న రీసర్వే ప్రాజెక్ట్ రాష్ట్ర ప్రత్యేక అధికారి డి.సుబ్బారావు

రేపల్లె రూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మీ భూమి-మా హామీ సర్వేతో ప్రజలకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని రీసర్వే ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారి డి.సుబ్బారావు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సర్వే సిబ్బందితో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మీ ఇంటికి మీ భూమి పథకం ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు భూములను ఖచ్చితమైన కొలతలతో గుర్తించేటం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పంట పొలాలకు పాసు పుస్తకాలు ఉన్న మాదిరిగా పట్టణ ప్రాంతాలలో భూములు, ప్లాట్‌లు కలిగిన హక్కుదారులకు నిర్దిష్టమైన కొలతలు తెలియజేస్తూ సర్టిఫికెట్‌లు జారీ చేస్తామన్నారు. సర్వే పూర్తయితే ఆ ప్రాంతాలలోని ప్రభుత్వ, ప్రైవేటు భూమి, ఇతర భూముల పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో ఉంటాయన్నారు. భూ హక్కుదారులకు అందజేసే పత్రాలలో క్యూఆర్ కోడ్‌తో జారీ చేయటం జరుగుతుందన్నారు. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. ఈ నూతన విధానంతో అమలవుతున్న మీ భూమి-మా హామీ సర్వేపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి నిర్దిష్టమైన కొలతలతో పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే రేపల్లె పట్టణ ప్రాంతంలో 60శాతంకు పైగా సర్వే పూర్తయినట్లు తెలిపారు. అక్టోబర్ మాసానికి నూరుశాతం సర్వే పూర్తిచేసి భూ యజమానులకు సంబంధిత పత్రాలు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సర్వే చేసే సమయంలో ఇబ్బందులు ఎదురైతే ఉన్నతాధికారికి తెలియజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

మహిళపై లైంగికదాడి కేసులో నిందితుడికి జైలు



పోలీసులు జైలుకు తరలిస్తున్న నిందితుడు నాగేంద్రం

పర్చూరు (చినగంజాం): బాపట్ల జిల్లా పర్చూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడు పిల్లి నాగేంద్ర బాబు అలియాస్ మోసెస్‌కు మంగళవారం ఒంగోలు అడిషనల్ జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ 13 సంవత్సరాల జైలు, రూ.4 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. కేసు వివరాలను పరిశీలిస్తే బాధితురాలు బాపట్ల జిల్లా చీరాల నుంచి పర్చూరు మండలం అడుసుమల్లి గ్రామానికి అరటికాయలు, మల్లెపూలు తీసుకొని వచ్చి అమ్ముకొని సాయంత్రానికి ఇంటికి వెళ్తుండేది. ఈ క్రమంలో 2021 జూలై 12వ తేదీ సాయంత్రం 6 గంటలకు అడుసుమల్లి నుంచి పర్చూరుకు రావడానికి గుంటూరు వైపు నుంచి వస్తున్న ఆటోలో ఎక్కింది. అందులో బాధితురాలు ఒకటే ఉండటంతో ఆటో డ్రైవర్ తన ఆటోను దేవరపల్లి గ్రామ పొలాల్లోకి వెళ్లి డొంక దారిలోకి తీసుకెళ్లి బాధితురాలిని చంపుతానని బెదిరించి ఆమెపై లైంగికదాడి చేశాడు. బాధితురాలు అతని బారి నుంచి తప్పించుకొని పర్చూరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు ప్రారంభించిన అప్పటి ఇంకొల్లు సీఐ పీ సుబ్బారావు నిందితుడైన ఆటో డ్రైవర్ పిల్లి నాగేంద్ర బాబు అలియాస్ మోసెస్ నేరం చేసినట్లు నిర్ధారించి అరెస్ట్ చేసి జైలుకు పంపారు. నేరం రుజువు కావడంతో రుజువు చేయడంతో న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ నేరస్తుడికి 13 ఏళ్ల జైలుశిక్ష రూ.4 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ పోలీస్ అధికారులను, పీపీని అభినందించారు. డీజీపీ కే రాజేంద్రనాథ్‌రెడ్డి మహిళల సంబంధిత నేరాల్లోని నిందితులకు జైలు శిక్ష పడేలా సంబంధిత కేసుల్లో పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు ట్రయల్ మానిటరింగ్ నిర్వహిస్తున్నారన్నారు. ఈ కోర్టు ట్రయల్ మానిటరింగ్ సత్ఫలితాలను ఇస్తుందన్నారు. పోలీసు అధికారులే స్వయంగా కోర్టు ట్రయల్‌ను పర్యవేక్షించడం వలన గతంలో పోలిస్తే ప్రస్తుతం కోర్టులో విధించే శిక్షల శాతం పెరిగిందని చెప్పారు.

కాలువలో వృద్ధుడి మృతదేహం

చీరాల అర్బన్: కుందేరు కాలువలో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గుర్తించారు. స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించగా టూటౌన్ సీఐ సోమశేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కోర్టు వెనుక గల గాంధీనగర్ దగ్గరలో కుందేరు కాలువలో బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ జారిపడి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నామన్నారు. ఘటన జరిగి ఒక రోజు అయి ఉంటుందని, మృతుడి వయస్సు 50 నుంచి 60 సంవత్సరాలు ఉంటాయన్నారు. గ్రీన్ కలర్ షర్టు ధరించి ఉన్నాడన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పున్నయ్య చౌదరికి స్పోర్ట్స్‌లో డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న పున్నయ్య చౌదరి

చీరాల రూరల్: భారత షటిల్ బ్యాడ్మింటన్‌కు విశేష సేవలందించిన కరణం పున్నయ్యచౌదరికి మలేషియా కౌలాలంపూర్‌లో రెండు రోజుల కిందట సెయింట్ మదర్ థెరిస్సా ఆస్ట్రేలియా యూనివర్సిటీ ద్వారా స్పోర్ట్స్‌లో గౌరవ డాక్టరేట్ అందించి సత్కరించింది. బాపట్ల జిల్లా ఇంకొల్లు గ్రామానికి చెందిన డాక్టర్ పున్నయ్య బ్యాడ్మింటన్‌లో 1965-66 పాటియాలలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ (ఎన్ఐఎస్)లో కోచ్‌గా డిప్లమో చేశారు. తదనంతరం ఆయన మన దేశంలో జరిగే అన్ని విభాగాల బ్యాడ్మింటన్‌కు అంపైర్‌గా ప్రాతినిధ్యం వ్యవహరించారు. అలానే 36 దేశాల్లో జరిగిన బ్యాడ్మింటన్‌లో కూడా ఎంపైర్‌గా వ్యవహరించారు. భారత షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు ఉపాధ్యక్షుడిగా, మన రాష్ట్ర అధ్యక్షుడిగా అనేక హోదాలలో పనిచేశారు. ప్రస్తుతం పదవి విరమణ పొందారు. ఆయనకు భార్య నాగేంద్రమ్మ, కుమారులు వెంకన్నబాబు, డాక్టర్ హరిష్‌బాబు ఉన్నారు. పున్నయ్య చౌదరి స్పోర్ట్స్‌లో గౌరవ డాక్టరేట్ అందుకోవడంపై ఉమ్మడి ప్రకాశం జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు చెందిన ప్రతినిధులు, క్రీడాప్రేమికులు, క్రీడాకారులు డాక్టర్ పున్నయ్యకు అభినందనలు తెలియజేశారు.

చట్టాలు, న్యాయ హక్కులపై అవగాహన అవసరం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి చంద్రమౌళేశ్వరి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి చంద్రమౌళేశ్వరి

గుంటూరు ఎడ్యుకేషన్: కళాశాల విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు చట్టాలు, న్యాయ హక్కులపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.చంద్రమౌళేశ్వరి సూచించారు. అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న చంద్రమౌళేశ్వరి మాట్లాడుతూ రాజ్యాంగంలో 39 (ఏ) అధికరణం కింద ఏర్పడిన న్యాయ సేవాధికార సంస్థ విధి, విధానాలను వివరిస్తూ అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందించడంతో పాటు న్యాయ విజ్ఞాన సదస్సుల నిర్వహణ, లోక్ అదాలత్‌లను నిర్వహించడం కర్తవ్యాలుగా వివరించారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు తావు లేని వాతావరణంలో విద్యార్థులు చదువుకోవాలని, ర్యాంగింగ్‌కు పాల్పడితే విద్యార్థుల భవిష్యత్ అంధకారంగా మారుతుందని స్పష్టం చేశారు. లోక్ అదాలత్ చైర్మన్ రాంబాబు మాట్లాడుతూ కళాశాలల్లో విద్యార్థులు ర్యాగింగ్ దుశ్చర్యకు దూరంగా ఉండాలని, ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోరాదని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ ప్యానెల్ న్యాయవాది కాళిదాస్, ప్రిన్సిపాల్ చిన్నం సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల సుబ్బారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేటీలో కార్డెన్ సెర్చ్

సరైన పత్రాలు లేని వాహనాలు స్వాధీనం



కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్న డీఎస్పీ మహేష్, సీఐలు భక్తవత్సలరెడ్డి, అశోక్‌కుమార్, వీరేంద్రబాబు

నరసరావుపేటటౌన్: ఎస్ఆర్‌కేటీ కాలనీలో మంగళవారం తెల్లవారుజామున డీఎస్పీ కె.వి.మహేష్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్డెన్ సెర్చ్‌లో భాగంగా తనిఖీలు నిర్వహించి సరైన పత్రాలు లేని పలు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు ముందస్తు నేరాల నియంత్రణలో భాగంగా తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అనుమానితులను గుర్తించటంతోపాటు రౌడీషీటర్‌ల కదలికలపై నిరంతరం నిఘా పెడతామన్నారు. నిబంధనల ప్రకారం వాహనాలకు సంబంధించి అన్ని పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అసాంఘిక కార్య క్రమాలు, జూద నిర్వహణ ఎక్కడైనా చేపడుతున్నట్‌లైతే పోలీస్ శాఖకు సమాచారం ఇవ్వాలన్నారు. మత్తు పదార్థాలు సేవించటం వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, అందువల్ల వాటి నుంచి దూరంగా ఉండాలన్నారు. తనిఖీల్లో రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి, వన్‌టౌన్, టూటౌన్ సీఐలు అశోక్‌కుమార్, వీరేంద్రబాబు, రూరల్ ఎస్ఐ నాగిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

యార్డులో 36,699 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 35,468 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 36,699 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.23,200 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 26,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.14,000 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,799 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

కొల్లిపరలో వ్యూహం చిత్రం షూటింగ్



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సన్నివేశాల చిత్రీకరణ

కొల్లిపర: గుంటూరు జిల్లా కొల్లిపరలో రామదూత క్రియేషన్స్ పతాకంపై దాసరి కిరణ్ కుమార్ నిర్మాతగా, సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ దర్శకత్వం వహిస్తున్న వ్యూహం సినిమా షూటింగ్ మంగళవారం ప్రధాన కూడలిలో ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ప్రారంభించారు. సినిమాకు సంబంధించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సన్నివేశాలు ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద నుంచి సాయి ఆలయం వరకు షూటింగ్ నిర్వహించారు. ఈ సినిమా రెండు భాగాలుగా విడుదలవుతుందని దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఇప్పటికే ప్రకటించగా మొదటి భాగానికి సంబంధించిన షూటింగ్ శరవేగంగా జరుపుతున్నారు. కొల్లిపరలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించిన సన్నివేశాలు, మహిళలు హారతులు ఇవ్వడం, పొలాల్లో మహిళా రైతు కూలీలతో కలసి భోజనం చేసిన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు చిత్రయూనిట్ తెలిపారు. తెనాలి పరిసర ప్రాంతాల్లోనే మరో నాలుగు రోజుల పాటు ఈ సినిమా షూటింగ్ జరుగుతుందని తెలిపారు.


ఫిజియో క్రికెట్ లీగ్ విజేత విశాఖ మార్వెల్ జట్టు



విజేత మార్వెల్ జట్టుతో క్రికెట్ నిర్వాహకులు

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ ఫిజియో థెరపిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల గ్రౌండ్స్, నంబూరు ఎం.ఎస్.కె క్రికెట్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఫిజియో క్రికెట్ లీగ్ ట్వంటీ-20-2023 పోటీలు మంగళవారంతో ముగిశాయి. ముగింపు వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న హారిక ఫిజియో విద్యా సంస్థల అధినేత షేక్ సుభాని మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో దశాబ్ద కాలం క్రితం ఏర్పడిన ఫిజియోథెరపీ ఫెడరేషన్ ఫిజియోథెరపీ రాష్ట్ర కౌన్సిల్ ఏర్పాటుతోపాటు సభ్యుల సహకారంతో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫిజియో క్రికెట్ లీగ్ 2023 నిర్వహణ కమిటీ చైర్మన్ డాక్టర్ మహమ్మద్ ఇమ్రాన్ మాట్లాడుతూ క్రికెట్ టోర్నీ విజయవంతంగా నిర్వహించడంలో ఫెడరేషన్ నాయకులు డాక్టర్ ఎస్.శరత్ చంద్రకుమార్, డాక్టర్ నాగ సతీష్, డాక్టర్ బీవీ హరికృష్ణ ఇతర సభ్యుల కృషి ఎనలేనిదన్నారు. సహకరించిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రత్యక్షంగా తిలకించటంతో పాటు 'టీవీ 2'న్యూస్ ఛానల్ ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ప్రసారం చేయటం ద్వారా వేలాదిమంది క్రికెట్ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుందని ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని పేర్కొన్నారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో విశాఖపట్నంకు చెందిన మార్వెల్ టీం విన్నర్స్ ట్రోఫీ, రూ.లక్ష నగదు అందుకున్నారు. విజయవాడకు చెందిన బీబీసీ - ఎస్‌జీఎస్ సూపర్ కింగ్స్ జట్టు ద్వితీయస్థానంలో నిలిచి రూ.50 వేల నగదు, షీల్డ్ అందుకున్నారు. మార్వెల్ వెల్నెస్ ప్రొడక్షన్ అధినేత ముప్పరాజు వెంకట్రావు, తులసి సర్జికల్స్ సంజీవ్ కుమార్, డాక్టర్ దయాకర్, డాక్టర్ ఏడుకొండలు, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దాట్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో 'శ్రీమేధ' ప్రభంజనం



విద్యార్థులతో నందకిషోర్, శ్రీలక్ష్మి

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) సోమవారం ప్రకటించిన సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థులు జాతీయ స్థాయి లో టాప్-10 మార్కులతో ప్రభంజనం సృష్టించారని సంస్థ చైర్మన్ అన్నా నందకిషోర్ తెలిపారు. మంగళవారం గుంటూరు బ్రాడీపేటలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థి ఎ.సాయి వెంకట ధీరజ్ 400మార్కులకు 335మార్కులతో టా పర్‌గా నిలిచినట్లు చెప్పారు. ఎం.మోక్షిత 313, షేక్ ఇర్ఫాన్ 301, డి.లక్ష్మీనరసింహ 298, టి.వరలక్ష్మి 296, డి. నాగ చంద్రిక 285 మార్కులు సాధించారని వివరించారు. సీఏ ఫౌండేషన్ లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సీఏ ఇంటర్ తరగతులతోపాటు ఉత్తీర్ణులు కా ని వారికి సీఏ ఫౌండేషన్ క్రాష్ బ్యాచ్ తరగతులు ఈ నెల 11న ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను నందకిషోర్, సంస్థ డైరెక్టర్ శ్రీలక్ష్మి అభినందించారు.

12 కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురు అరెస్టు
- మూడు సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం



గంజాయి నిందితులతో సీఐ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది

జి.మాడుగుల: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు-జి.మాడుగుల రోడ్డులో జి.ఎం.కొత్తూరు జంక్షన్ వద్ద పోలీసులు 12 కిలోల గంజాయిని పట్టుకున్నారు. కారుతోపాటు మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేశారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ సత్యనారాయణ వెల్లడించిన వివరాల ప్రకారం.. జి.ఎం. కొత్తూరు జంక్షన్ వద్ద సోమవారం సాయంత్రం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, చింతపల్లి వైపు నుంచి వస్తున్న కారును ఆపి తనిఖీ చేశారు. కారులో ప్రకాశం జిల్లాకు చెందిన మైలపోగు సాగర్‌బాబు, పల్నాడు జిల్లాకు చెందిన తిరుమల ఏసుబాబు, జి.మాడుగుల మండలం వంజరి పంచాయతీ నీలమెట్ట గ్రామానికి చెందిన కిల్లో కృష్ణ మైదాన ప్రాంతానికి 12 కిలోల గంజాయిని తరలిస్తున్నట్టు గుర్తించారు. గంజాయిని, కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేశారు. వీరిని రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. గంజాయిని పట్టుకున్న పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు.

సర్వేను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



రెడ్డిపాలెంలో ఓటర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఆర్డీవో శేషిరెడ్డి

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం, సంతగుడిపాడు గ్రామాల్లో జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి విద్య, ఓటర్ల సర్వేలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వి.రెడ్డిపాలెంలోని బూత్ నెంబర్ 7లో బీఎల్‌వో ఓటర్ల జాబితా, ఇంటింటి సర్వే తీరును ఆయన పరిశీలించారు. పలువురు ఓటర్లతో బూత్‌లెవెల్ అధికారులతో మాట్లాడారు. పలువురు ఓటర్లు అడిగిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గ అంశాలపై పలు ఆదేశాలను బీఎల్‌వోలకు ఇచ్చారు. త్వరితిగతిన పూర్తి చేయాలన్నారు. ఆర్డీఓ శేషురెడ్డి కూడా పాల్గొని పరిశీలించారు. ఆ గ్రామంలో హైస్కూల్ విద్యార్థులతో వారి విద్య, క్లాస్‌ల నిర్వహణ, సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. సంతగుడిపాడు గ్రామంలో ఎడ్యుకేషన్ సర్వేను తనిఖీ చేశారు. సర్వే ప్రక్రియలో భాగంగా తల్లిదండ్రులతో వలంటీర్లు మాట్లాడిన తీరును, సంప్రదింపులు అడిగి తెలుసుకున్నారు. ఎడ్యుకేషన్ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. బడిమానివేసిన, బడిబయట ఉన్న పిల్లల వివరాలను, సేకరణ వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. వారందరూ బడిలో చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకవేళ బడికి వెళ్ల కుంటే అందుకు గల కారణాలతో నివేదిక పంపించాలని సూచించారు. కాలనీలోని బడిబయట, బడిమానివేసిన పిల్లల తల్లిదండ్రులతో, పిల్లలతో ఆయన మాట్లాడి బడిలో చేర్పించాలని, విద్య వల్ల కలిగే ఉపయోగాలపై వారికి వివరించారు. అనంతరం సంతగుడిపాడు సచివాలయంలో విద్యాశాఖ అధికారి శామ్యేల్, ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు, ఎండీవో మ్యాథ్యూబాబు, తహసీల్దార్ అంకారావు, ప్రధానోపాధ్యాయులు, వలంటీర్లతో ఇతర అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బత్తుల రామకృష్ణ, ఆర్ఐ సుబ్బారావు, వీఆర్వో సురేష్, పీఎస్ సూర్యప్రకాష్, సచివాలయాల సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల రక్తహీనతపై చర్యలు తీసుకోవాలి

నరసరావుపేటఈస్ట్: కౌమారదశ బాలికలలో ఉన్న రక్తహీనత శాతాన్ని తగ్గించేలా వైద్య ఆరోగ్య, మహిళా, శిశు సంక్షేమశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో మంగళవారం ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ శివశంకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బడిలో చదువుతున్న బాలికలు, బడి బయట ఉన్న బాలికలల్లో రక్తహీనత సమస్యను గుర్తించి వారికి అవగాహన కల్పించటంతోపాటు పౌష్టికాహారం, మందులు అందించి వారి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాలికా సంరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. ఆయా శాఖల అధికారులు ఎటువంటి అలసత్వం ప్రదర్శించకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ధైర్యంతో ముందుకెళితేనే విజయాలు

క్రికెటర్ అంబటి రాయుడు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ధైర్యంతో ముందుకు సాగితేనే ఆశించిన విజయాలు లభిస్తాయని భారత క్రికెటర్ అంబటి రాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక అరండల్‌పేటలోని పిచ్చుకులగుంట క్రీడా మైదానానికి వచ్చిన అంబటి రాయుడు యువ క్రికెటర్లతో ముచ్చటించారు. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి దాసరి రమేష్ కుమార్ దగ్గరుండి మైదానాన్ని, క్రికెట్ నెట్స్‌ను చూపించారు. అంబటి రాయుడు మాట్లాడుతూ ఏసీఏ ఆధ్వర్యంలో రాష్ట్రంలో క్రికెట్ బాగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఇంతటి వసతులుంటే క్రికెటర్లు త్వరగా రాణించే వీలుంటుందన్నారు. బౌలర్ ఎవరైనా మన బ్యాటింగ్‌పై నమ్మకముంచి ధైర్యంగా ఎదుర్కోవాలని చిన్నారులకు చెప్పారు. ఎన్నో క్లిష్ట పరిస్థితుల్లో తనను ధైర్యమే ముందుకు తీసుకెళ్లిందని చెప్పారు. రమేష్ కుమార్, రామకృష్ణ పరమహంస, అయితి సతీష్, శ్రీధర్, జక్కా శ్రీనివాస్, శర్మ, ఇండ్ల భాస్కర్ పాల్గొన్నారు.



క్రికెటర్ అంబటి రాయుడితో జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు